క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల


పూసల బండి వాహనాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: పట్టణంలోని 9వ వార్డు వాల్మీకి వీధిలో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పూసల బండి వాహనాన్ని నడిపారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, స్థానిక కౌన్సిలర్లు బోప్పరపు మాధవి, శివ, తిరుపతయ్య, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

నేడు శివలింగ ప్రతిష్ట

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులో మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం భారీ శివలింగ ప్రతిష్ట జరగనుంది. దాదాపు 1111 శివలింగాలను ఒకే చోట చేర్చి భక్తుల నడుమ ప్రతిష్ట చేయనున్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం శివలింగాలను ప్రతిష్టించిన దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం జరగనున్న ప్రతిష్టకు రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, స్వామిజీలు పాల్గొననున్నట్లు, ఆలయ వ్యవస్థాపకుడు పలుకూరి సుబ్బారావు తెలిపారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

పొన్నలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన నిరోష కుటుంబానికి ఆరోగ్య సిబ్బంది ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పీహెచ్‌సీ డాక్టర్ ఉన్నం కీర్తి ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది రూ. 71,500 నగదు నుధావారం నిరోష భర్త, పిల్లలకు అందజేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి నిరోష భర్త సుబ్రహ్మమయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

450 మందికి వైద్య పరీక్షలు


మాట్లాడుతున్న మెరైన్‌సీఐ కిశోర్‌కుమార్,

ఉలవపాడు: తీరప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని రామాయపట్నం మెరైన్ సీఐ కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పెదపట్టపుపాలెంలో మత్స్యకార సంక్షేమ సమితి, మెరైన్ పోలీసు శాఖ, శ్రీనిధి ఫిషరీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. తీర ప్రాంత ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు చాపల వంశీకృష్ణ, చాపల శాంత కుమారి, ధీరజ్‌బాబు, విజయ్‌కుమార్, కుమార వర్మ, సరయు, ఏడుకొండలు 450 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. శ్రీనిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల డైరెక్టర్ విజయరత్నం, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి సున్నపు తిరుపతి, మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

నేడు నర్రావానిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

సింగరాయకొండ: మండలంలోని సోమరాజు పల్లి పంచాయతీ నర్రావానిపాలెంలో సోమవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

హజ్ యాత్రకు వెళ్తున్న ఏఎస్సై బేగ్‌కు అభినందన

సింగరాయకొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో హజ్ యాత్రకు వెళ్తున్న ఏఎస్సై షేక్ మహబూబ్‌బేగ్ క్షేమంగా తిరిగి రావాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆకాంక్షించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి హజ్‌యాత్రకు వెళ్తున్న ఏఎస్సై బేగ్‌కు అభినందన సభ నిర్వహించారు. సీఐతోపాటు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమా, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, రైటర్ రమణయ్య, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ ఇస్మాయిల్ తదితరులు ఏఎస్సై బేగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లాలనే తన చిరకాల వాంఛ ప్రభుత్వ సహకారంతో తీరబోతోందన్నారు. ఈ నెల 15న యాత్రకు బయలుదేరుతున్నానని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అక్షర యజ్ఞానికి.. అంతా సిద్ధం

- బడుల్లో విద్యా కానుక రెడీ
- తొలి రోజే విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు


స్టాక్ పాయింట్‌లో రెడీగా ఉన్న జేవీకే కిట్లు


విద్యార్థుల బ్యాగులను పరిశీలిస్తున్న నాణ్యత కమిటీ

మండలం	ఉన్నత పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ప్రాథమిక పాఠశాలలు	మొత్తం పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
కనిగిరి	15	14	85	114	9,150
పామూరు	9	9	70	88	5,542
వెలిగండ్ల	6	2	58	66	4,180
హెచ్‌ఎంపాడు	9	5	51	65	4,150
సీఎస్‌పురం	9	6	50	65	4,130
పీసీపల్లి	7	6	43	56	3,357
మొత్తం పాఠశాలలు	55	42	357	454	30,509


స్టాక్ పాయింట్‌లో సిద్ధంగా ఉన్న బుక్స్

కనిగిరి రూరల్: పాఠశాలలు నేటి నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో ముందుగానే బడుల్లో విద్యాకానుక కిట్లు రెడీ చేశారు. జేవీకే కిట్లు అన్ని పాఠశాలలకు రెండ్రోజులు ముందుగానే చేరేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. స్కూల్ తెరచిన రోజునే జేవీకే కిట్లను అందించేందుకు సర్వం సిద్ధం చేశారు. విద్యా శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన జేవీకే కిట్లను స్టాక్ పాయింట్లలో పాఠశాలల వారీగా చేర్చే పనుల్లో నిమగ్నమయ్యారు.

పూర్తిస్థాయిలో పర్యవేక్షణ..

పాఠశాలల ప్రారంభమయ్యే రోజు ఈ నెల 12న జేవీకే కిట్లు పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో పాటు, తదనుగుణంగా జిల్లా, మండల, కేంద్రాలకు విద్యా కానుక కిట్లను సరఫరా చేసింది. ఇక విద్యార్థులకు పంపిణీ చేయాల్సిందే తరువాయి. కనిగిరి నియోజవకర్గంలోని ఆరు మండలాల్లో 454 పాఠశాలలున్నాయి. వాటిలో 30,509 మంది విద్యార్థులు 1నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఆరు మండలాల్లో మొత్తం ఉన్నత పాఠశాలలు 55, ప్రాథమికోన్నత 42, ప్రాథమిక పాఠశాలలు 357 ఉన్నాయి. మండలాల వారీగా మొత్తం ఉన్నత, (జెడ్పీ, ఎయిడెట్, కేజీబీ, మోడల్ స్కూల్‌లు), ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు కలిపి కనిగిరిలో 114, పామూరులో 88, వెలిగండ్లలో 66, హెచ్‌ఎంపాడులో 65, సీఎస్ పురంలో 65, పీసీపల్లిలో 56 ఉన్నాయి. వీరందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఇప్పటికే కొన్ని మండలాల్లో జేవీకే కిట్లను స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాయింట్‌లకు చేర్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జగనన్న విద్యా కానుక కిట్లు అయిన బ్యాగ్, యూనిఫాం, టెక్ట్స్ బుక్, నోట్ బుక్స్, షూస్, సాక్స్, బెల్ట్, టైలను స్టాక్ పాయింట్ల వద్ద విద్యాశాఖ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు పర్యవేక్షణలో జేవీకే కిట్‌గా తయారు చేశారు.

నాణ్యత కమిటీ పరిశీలన

కిట్ల తయారీలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా, సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఎంఈఓ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలన కమిటీ పర్యవేక్షిస్తోంది. పాఠ్య పుస్తకాలు ఎక్కడైనా ముద్రణా లోపం ఉన్నా, లోపల పేజీలు చిరిగి పోయినా వాటిని ముందుగానే వేరు చేసి పెట్టారు. దాదాపు ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

> **తొలిరోజే జేవీకే కిట్లు అందిస్తాం**
> పాఠశాల పునః ప్రారంభం రోజే సోమవారమే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందిచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. కిట్లలోని వస్తువులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాం. ప్రత్యేక దృష్టితో నాణ్యమైన కిట్లనే విద్యార్థికి అందించేలా ఏర్పాటు చేశాం. ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందచేస్తాం. స్టాక్ పాయింట్ల నుంచి హెచ్‌ఎంల పర్యవేక్షణలో ముందుగానే జేవీకే కిట్లు స్కూల్‌కు చేర్చుతున్నాం.
> – జె.ప్రసాద్‌రావు, ఎంఈఓ


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

నెల్లూరమ్మ తల్లికి ఎమ్మెల్యే బుర్రా పూజలు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండల పరిధిలోని కృష్ణం నాయునిపల్లిలో జరుగుతున్న నెల్లూరమ్మ తల్లి వార్షికోత్సవాలకు ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే బుర్రా ఆలయ సంప్రదాయాలతో సన్మానించారు.

అనంతరం స్థానిక నాయకులతో కలసి కుంకుమ బండ్ల కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా బండలాగుడు ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట మితికాల గురవయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

కిటకిటలాడిన భైరవకోన


భైరవేశ్వరునికి పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

సీఎస్‌పురం(పీసీపల్లి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి కావడంతో భైరవకోనలో జలపాతాన్ని వీక్షించేందుకు రాష్ట్రంలో నలుమూలల నుంచి భక్తులకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించింది. భైరవకోన మూల విరాట్ త్రిముఖ దుర్గాంబను మండల వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్ రెడ్డి , సిద్దు వెంకటరెడ్డిలు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అందుతున్న సౌకర్యాలపై , ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు.
భైరవకోన భైరవేశ్వర స్వామికి పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన గొడవల్లి ఆదినారాయణ- సత్యవతి దంపతులు, వారి కుమారులు జగదీష్- విజయలక్ష్మి, ఆదిత్య పవన్‌కుమార్- లక్ష్మి అహల్యలు అమ్మవారికి రూ. 30500 విలువ చేసే 3 బంగారు కళ్లను బహుకరించారు. ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈఓ నర్రా సూర్యనారాయణరెడ్డి ఆలయ సాంప్రదాయాలతో పూజలు చేయించి శేషవస్త్రాలతో సన్మానించారు. గోపవరం బయ్యపురెడ్డి, మునగల గోపాల్‌రెడ్డి, కోడూరి లక్ష్మీ రెడ్డి -సుభాషిణి దంపతులు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లితో వెళ్లినా.. ప్రాణాలు మిగిలేవేమో..


ఎస్‌కే షారూక్(ఫైల్)

కనిగిరి రూరల్: పట్టణంలో అందరితో కలివిడిగా తిరిగే షారూక్ (27) ఆకస్మిక మృతిని ఎవ్వరూ జీర్ణించుకోలేక పోతున్నారు. ఉద్యోగ రీత్యా తండ్రి జిలానీ బాపట్ల జిల్లా రేపల్లో నివసిస్తున్నారు. జిలానీ ఇద్దరు కుమారులు అమ్మమ్మ దగ్గరే కనిగిరిలో ఉంటున్నారు. వారం రోజుల క్రితం కనిగిరికి వచ్చిన తల్లి ఎస్థాని బేగం తనతో ఊరికి రావాలని కుమారులను పిలిచారు. వారు వెళ్లకుండా రెండ్రోజులు తర్వాత వస్తామని షారూక్ చెప్పినట్లు తెలిసింది. సోమవారం రేపల్లేకు వస్తానని చెప్పి తల్లి దగ్గర నుంచి రాత్రి డబ్బులు కూడా వేయించుకున్నాడని బంధువులు తెలిపారు. తెల్లవారక ముందే కుమారుడు మృత్యు వార్త విని ఆ తల్లితండ్రులు చేసే ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. చెట్టంత కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బోరున విలపిస్తున్నారు. షారూక్ భౌతికకాయాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, స్థానిక నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


షారూక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


జాళ్లపాలెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొండపి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పెదకండ్లగుంట పంచాయతీ జాళ్లపాలెం గ్రామంలో ఆదివారం ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి వరికూటి అశోక్‌బాబు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నడైనా ఇన్ని పథకాలు మీకు అందాయా అని గ్రామస్తులను అడిగారు. ప్రతి పనికి జన్మభూమి కమిటీలు పేదలను పీల్చి పిప్పి చేశాయని ఇప్పుడు జగనన్న పాలనలో నేరుగా ఇంటికే పథకాలు అందటం మీరు చూస్తున్నారని అశోక్‌బాబు వివరించారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. గత టీడీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవటం తప్ప చంద్రబాబు అండ్ కో ప్రజలకు చేసిన ఒక్క మేలు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పి శాశ్వతంగా మూలన పెట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, ఎంపీటీసీ బొల్లా సుబ్బారావు, ఉప సర్పంచ్ బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగాభవానీ నెల పొంగళ్లు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా, నేతలు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగామాత ఆలయంలో గంగాభవానీ నెలపొంగళ్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వేకువజామునే చన్నీటి స్నానమాచరించి పొంగళ్లు పొంగించి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. నెలపొంగళ్ల సందర్భంగా ఆలయంలో అర్చకులు కొల్లూరి రవికిరణ్ శర్మ ప్రత్యేక పూజలు చేయగా ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్యలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా జేడీఏహెచ్ డాక్టర్ బేబిరాణి

కొండపి: రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబిరాణి సూచించారు. ఆదివారం కొండపిలో రైతులకు పశు బీమా పథకంపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో పశువులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులకు ఊరట కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పశుబీమా పథకం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో ఉన్న వైఎస్సార్ పశునష్ట పరిహారం పథకం స్థానంలో నూతన బీమా పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు తమ వాటాగా 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారుల వాటా 50 శాతంగా నిర్ణయించినట్లు తెలిపారు. పథకంలో గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు లేదా పందులు బీమా చేసుకోవడానికి అవకాశం ఉందని వివరించారు. కొండపి ఏడీ పరిధిలో పశు బీమా చాలా తక్కువ మంది చేయించుకున్నారని, అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ వరికూటి అమృతపాణి, వైస్ ఎంపీపీలు వేముల వెంకటప్రసాద్, రావులపల్లి కోటరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

237 మందికి నేత్ర వైద్య పరీక్షలు


వృద్ధురాలికి ఓపీ కార్డు అందిస్తున్న వరికూటి అశోక్‌బాబు తదితరులు

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వరికూటి మాలకొండయ్య, కోటమ్మ జ్ఞాపకార్థం గుంటూరు శంకర నేత్ర వైద్యశాల, వరికూటి చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి 237 మంది రోగులు హాజరైనట్లు వైద్యశాల ఎగ్జిగ్యూటివ్ అధికారి నాగబాబు తెలిపారు. వైద్య శిబిరాన్ని రోగులతో కలిసి కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ వరికూటి అమృతపాణి, పశుసంర్థక శాఖ జేడీ డాక్టర్ బేబిరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో కంటి సమస్యలతో అవ్వాతాతలు ఇబ్బంది పడుతు సొంత పనులు సైతం చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 141 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని డాక్టర్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొండపి కళాశాల ప్రాంగణం నుంచి బస్సులో తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి ఇంటికి చేర్చనున్నట్లు చెప్పారు. మరిన్ని శిబిరాలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరికూటి అమృతపాణి, డాక్టర్ బేబిరాణి, డాక్టర్ విష్ణుప్రియ, స్మృతిఅగర్వాల్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగే స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీలో అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. నేరుగా స్పందనకు వచ్చి అర్జీలు ఇవ్వలేని వారు 9177700267 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు.

120 మందికి వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకయ్య

టంగుటూరు: స్థానిక వడ్డేపాలెంలోని న్యూ జెరుసలేం చర్చిలో బొడ్డు నరసింహం, ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య ప్రారంభించారు. 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు, ఆధాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, డాక్టర్లు జె.నాగేశ్వరరావు, అనపర్తి శ్రీనివాసరావు, వి.చెంచయ్య, మానస, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి తిమ్మారెడ్డిపాలెం వద్ద ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌పై దాడి చేసి పట్టుకుని లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు


బహుమతులు అందచేస్తున్న ఎంఈఓ ప్రసాద్‌రావు

కనిగిరి రూరల్: విద్యార్థులు గ్రంథాలయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ జె.ప్రసాద్‌రావు అన్నారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఎస్‌కే షరీఫ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సంపుటికలన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, జేవీవీ కార్యదర్శి గయాజ్, దోసపాటి నర్సయ్య, ఫణీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లోని విజేతలకు ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.

రాష్ట్రానికి బీజేపీ తీరని అన్యాయం

కందుకూరు: రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడి, అమిత్‌షాలకు రాష్ట్రంలో పర్యటించే హక్కులేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి. సురేష్ బాబు అన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, యువకుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేస్తున్న నరేంద్రమోడీ, అమిత్‌షాలు రాష్ట్రంలో ఎలా పర్యటిస్తారన్నారు. సీపీఎం నాయకులు ఎస్‌ఏ గౌస్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద్‌మోహన్, సీపీఐ నాయకులు లక్ష్మీనారాయణ, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, సీతారామయ్య, కోటేశ్వరరావు, నరసయ్య, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చదవడం అలవాటుగా మార్చుకోవాలి

ఉలవపాడు: విద్యార్థులు చదవడం అలవాటుగా మార్చుకోవాలని పిల్లల వైద్య నిపుణుడు సతీష్‌బాబు అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తుందన్నారు. వైద్యురాలు ఐశ్వర్య మాట్లాడుతూ చదువు వల్ల మనిషి ఎంతో కీర్తించబడతాడని, దానికి ప్రధానంగా గ్రంథాలయంలో పుస్తకాలు చదవాలని తెలియచేశారు. పెదపట్టపుపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సలీమ్ బాషా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు క్రమం తప్పక వస్తూ వాటిలోని సారాంశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరావు పాల్గొన్నారు.